క్లుప్తంగా...

'బ్రాహ్మణ భవన్' ప్రారంభోత్సవానికి తరలిరండి


రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్‌శర్మ

మణికొండ: గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం కేసీఆర్ బ్రాహ్మణులకు అన్ని అవసరాలకు పనికొచ్చేలా నిర్మించిన బ్రాహ్మణ భవన్ ప్రారంభోత్సవానికి పెద్ద ఎత్తున బ్రాహ్మణులు తరలి రావాలని భాగ్యనగర అర్చక, పురోహిత సంఘం, బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ మధుసూదన్‌శర్మ పిలుపునిచ్చారు. ఈ నెల 31న గోపన్‌పల్లిలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా భవన్‌ను ప్రారంభిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి బ్రాహ్మణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి


పాల్మాకులలో ప్రారంభిస్తున్న సర్పంచ్ సుష్మా

శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకులలో 'కంటి వెలుగు' కార్యక్రమాన్ని సర్పంచ్ సుష్మా ప్రారంభించారు. పెద్దషాపూర్ పీహెచ్‌సీ వైద్య బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు. వైద్యులు డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ ఉస్మాన్, సిబ్బంది రాహుల్, రజిని, విద్యులత, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

మంచిరేవులలో 'మేరీలైఫ్' సమావేశం


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శారద

మణికొండ: చిరుధాన్యాలు, ఆకుకూరలను కుటుంబానికి అందించినప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని గృహిణి పోషక విలువల గురించి తప్పనిసరి తెలుసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద అన్నారు. బుధవారం నార్సింగి మున్సిపాలిటీ మంచిరేవులలో జరిగిన మేరీ లైఫ్ సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా నీటివృధా, ప్లాస్టిక్ వాడకం, చేతుల పరిశుభ్రత ఆవశ్యకతల గురించి మహిళలకు వివరించారు. ఏఎన్‌ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు సుధారాణి, నళిని, అనిత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు, రేపు అంతర్జాతీయ సమావేశం

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంలోని ఇంగ్లిష్ విభాగం, నేషనల్ ట్రాన్స్‌లేషన్ మిషన్(ఎన్‌టీఎం) సెంటర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సహకారంతో రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆ విభాగం హెడ్ ప్రొఫెసర్ షాహీన్ బుధవారం తెలిపారు. 'భాష, సాహిత్యం యొక్క విభజనలను అన్వేషించడం' అనే అంశంపై ఈ సమావేశం సాగుతుంది. గురువారం ఉదయం 11 గంటలకు ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సీపీడీయూఎంటీ ఆడిటోరియంలో ఈ సమావేశాన్ని ప్రారంభిస్తారు. పరిశోధనా ఫలితాలు, అనుభవాలను పంచుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు.

26 నుంచి చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంప్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో 'బాలబృందావనం' పేరిట చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారు. ఈ క్యాంప్‌లో పాల్గొనేందుకు 9 నుంచి 14 ఏళ్లలోపు వారికే అవకాశం. కార్యక్రమంలో పాల్గొనేవారు తమ పేర్లను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించాలి.

మహ్మద్ అమీర్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూలో ఇస్లామిక్ స్టడీస్ పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీని ప్రకటించారు. మహ్మద్ అమీర్ ఇస్లామిక్ స్టడీస్ విభాగం హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ ఫాహీమ్‌అక్తర్ పర్యవేక్షణలో ఎన్విరాన్‌మెంటల్ పొల్యూషన్–యాన్ ఇస్లామిక్ పర్స్‌పెక్టివ్' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు.

రూ. 3.69 కోట్లతో అభివృద్ధి పనులు


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

శంషాబాద్: మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో రూ.3.69 కోట్ల పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. శంషాబాద్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మరిన్ని నిధులతో పట్టణంలోని మౌలిక సమస్యలను తీర్చేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు, నార్సింగి ఏఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్,కౌన్సిలర్లు జహంగీర్‌ఖాన్, అజయ్, మస్రత్‌జాన్, కుమార్, విజయలక్ష్మి,రాణి, లావణ్య, అమృత, లక్ష్మి, సంజయ్‌యాదవ్, రేఖ పార్టీనేతలు పాల్గొన్నారు.

రూ. 45 లక్షలతో సీసీ రోడ్డు పనులు..


సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కౌన్సిలర్ శ్రీకాంత్‌రావు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోనే తన 6వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావు అన్నారు. ఎస్సీ బస్తీలో రూ. 45లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటికే తన వార్డులో అనేక సీసీ రోడ్లు, విద్యుత్ స్తంబాల మార్పు, నీటి సౌకర్యం, వీధిదీపాల వంటి సౌకర్యాలను కల్పించామన్నారు. భవిష్యత్తులో మిగిలి ఉన్న అన్ని పనులను పూర్తిచేసి ఆదర్శవార్డుగా తీర్చి దిద్దుతానన్నారు.

జీహెచ్‌ఎంసీ టోల్ ఫ్రీకి ఫిర్యాదు చేయాలి..

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలోని కాలనీ, బస్తీ ప్రజలు డ్రైనేజీ సమస్యపై జీహెచ్‌ఎంసీ టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని డివిజన్ బీజేపీ అధ్యక్షులు విజయ్‌కుమార్ కోరారు. గత కొన్నేళ్లుగా ప్రధాన రహదారిపై డ్రైనేజీ పొంగిపొర్లుతోందని దశాబ్దాలుగా సామభూపాల్ రెడ్డి గార్డెన్ ఆవరణలో డ్రైనేజీ సమస్య నెలకొందన్నారు. దీనిపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదన్నారు. దీంతో బస్తీవాసులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. తాను జీహెచ్‌ఎంసీ టోల్ ఫ్రీ 155313కి డ్రైనేజీ సమస్యపై ఫిర్యాదు చేయడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు బుధవారం డ్రైనేజీకి మరమ్మతులు నిర్వహించారన్నారు. పైకప్పులు శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతులు చేపట్టారన్నారు. ఫిర్యాదు నంబరు ఆధారంగా సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని సూచించారు.


డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తున్న సిబ్బంది

సీఎం కప్ జిల్లా స్థాయిలో రాణించిన రెజ్లర్లు


పోటీలను ప్రారంభిస్తున్న అసోసియేషన్ నాయకులు

మణికొండ: గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి సీఎంకప్ రెజ్లింగ్ పోటీల్లో గండిపేట మండల రెజ్లర్‌లు రాణించారు. 4 విభాగాల్లో జరిగిన పోటీల్లో మొదటి స్థానాల్లో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కోచ్ శ్రీకాంత్‌యాదవ్ ప్రకటించారు. నార్సింగి గ్రామానికి చెందిన సందీప్ కుమార్ 57 కేజీల విభాగం, కోకాపేట్‌కు చెందిన జి.కుమార్ 65 కేజీల విభాగం, ఖానాపూర్‌కు చెందిన రాజు 86 కేజీల విభాగం, అదే గ్రామానికి చెందిన నరేందర్ 86 కేజీల విభాగంలో బంగారు పతకాలను సాధించారన్నారు. ఈ నెల 28,30 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని వివరించారు. బుధవారం జరిగిన పోటీల్లో జిల్లా రెజ్లింగ్ సీఎంకప్ ఇన్‌చార్జ్ సుధాకర్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.యాదయ్యముదిరాజ్, కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యక్షుడు పాండు, కోచ్‌లు సుధాకర్‌యాదవ్, సన్నీలు పాల్గొన్నారన్నారు.

చెరువుల కబ్జాను పట్టించుకోవడం లేదు


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర యువమోర్చా ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్

రాజేంద్రనగర్: పల్లె చెరువుతో పాటు కొత్త చెరువు కబ్జా అవుతున్నా.. ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర యువ మోర్చా ఉపాధ్యక్షులు బైతి శ్రీధర్ ఆరోపించారు. బుధవారం ఆ పార్టీ యువమోర్చా అసెంబ్లీ కన్వీనర్ సూరెడ్డి వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లక్ష్మీగూడలోని కొత్త చెరువుతో పాటు పల్లె చెరువు రోజురోజుకు కబ్జాకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నివాసముండే దుర్గానగర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్న సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించడం లేదన్నారు. ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో కబ్జాపై తాము న్యాయ పోరాటానికి సైతం సిద్ధమని స్పష్టం చేశారు. మజ్లిస్, బీఆర్‌ఎస్ పార్టీ నేతలు కలిసి కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు అడికె రాజు, బీజేవైఎం అధికార ప్రతినిధి శ్రీను, బీజేవైఎం వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌యాదవ్, సిద్ధూ ముదిరాజ్, జ్ఞానేశ్వర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పునః ప్రారంభమైన పిల్లోనిగూడ రైల్వే గేటు

సమస్య పరిష్కారం కావడంతో స్థానికుల హర్షం


తెరుచుకున్న రైల్వేగేటు

శంషాబాద్ రూరల్: పిల్లోనిగూడ–పాల్మాకుల మధ్యలో ఉన్న రైల్వే గేటును ఎట్టకేలకు బుధవారం తిరిగి ప్రారంభమైంది. సుమారు మూడు నెలల క్రితం ఈ గేటును మూసివేయడంతో స్థానికులకు ఎదురౌతున్న ఇబ్బందులను ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఈనెల మొదటివారంలో దక్షిణ మధ్య రైల్వే జీఎంను కలిసి సమస్యను వివరించారు. గేటు మూసివేతతో సమీప గ్రామాల ప్రజలు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో విషయాన్ని ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వారి చొరవతోనే గేటును యథాతథంగా కొనసాగించారని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

దివ్యాంగులందరికీ బస్‌పాస్‌లు ఇవ్వాలి


సదరం పత్రాలు, బస్‌పాస్‌లను అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

మణికొండ: గండిపేట మండల పరిధిలో ఉన్న దివ్యాంగులందరికీ టీఎస్ ఆర్టీసీ తప్పనిసరిగా బస్‌పాస్‌లను అందించాల్సిన అవసరం ఉందని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండాపూర్ ఆసుపత్రిలో ఉచిత బస్‌పాస్‌లకు అవసరమైన సదరం పరీక్షలను నిర్వహించారు. అక్కడికక్కడే అర్హత కలిగిన వారికి బస్‌పాస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో బస్‌పాస్‌లు ఇచ్చిన వారితో పాటు కొత్త వారికి ఇప్పటి వరకు బస్‌పాస్‌లు రాని వారికి సైతం పరీక్షలు నిర్వహించి జారీ చేయాలని కోరారు. మణికొండ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు బీరప్ప, నాయకులు ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మజ్లిస్ ఎమ్మెల్సీ పర్యటన


బస్తీల్లో పర్యటిస్తున్న మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని సులేమాన్‌నగర్ డివిజన్‌లోని హసన్‌నగర్, మహమూద్‌నగర్ ప్రాంతాల్లో మజ్లిస్‌పార్టీ ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ పర్యటించారు. డ్రైనేజీ సమస్యపై స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేయగా.. జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి బుధవారం పర్యటించి స్థానిక సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెండు బస్తీలలో ప్రధానంగా డ్రైనేజీ సమస్య నెలకొందని స్థానికులు వివరించడంతో కొత్తగా పైపులైన్ వేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. నిధుల మంజూరుకు తాను సంబంధిత అధికారులతో చర్చించి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు నవాజుద్దీన్, మహ్మద్ జహంగీర్, జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారితకు కృషి చేయాలి

హెచ్‌సీయూ అసోసియేట్ ప్రొ.డాక్టర్ షీలా సూర్యనారాయణన్


మాట్లాడుతున్న షీలా సూర్యనారాయణన్

రాయదుర్గం: హక్కులు, వనరులు, ప్రాతినిధ్యం వంటి మూడు ముఖ్యమైన పద్ధతులకు ఎంతో ప్రాముఖ్యత ఉందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విమెన్స్ స్టడీస్ సెంటర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షీలా సూర్యనారాయణన్ పేర్కొన్నారు. మహిళా సాధికారిత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జర్మనీ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ కో ఆపరేషన్ నిర్వహించిన రిటర్నింగ్ ఎక్స్‌పర్ట్ ఈవెంట్‌లో ఖాట్మండు 'ఫెమినిస్ట్ డెవలప్‌మెంట్ పాలసీ (ఎఫ్‌డీపీ)పై ఆమె ప్రత్యేక ఉపన్యాసం చేశారు. విద్యార్హత, గ్రామిక శక్తి భాగస్వామ్యం, హింస, రాజకీయ భాగస్వామ్యం, కుమారుల ప్రాధాన్యత ఫలితంగా బాలికలు, మహిళలపై వివక్ష చూపడానికి ఆస్కారం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో పలువురు మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్వహణకు సంపూర్ణ సహకారం



గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని ఆలయ నిర్వాహకులకు అన్ని రకాలుగా సహాయ సహకారం అందిస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. నానల్‌నగర్ డివిజన్ తిరుపల్లిగడ్డలోని కోవెల రంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్టాపన ఆహ్వాన పత్రాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ఈ. శ్రీనివాసరాజు బుధవారం ఎమ్మెల్యేను కలిసి అందజేశారు. ఆలయ ప్రాంగణంలో లక్ష్మీనరసింహస్వామి సమేత గోదా రంనాథస్వామి విగ్రహాల ప్రతిష్టాపన కోసం నూతనంగా ఆలయాన్ని నిర్మించడం జరిగిందని, ఈ దేవతా విగ్రహాల ప్రతిష్టాపన ఈనెల 31న నిర్వహిస్తున్నామని కార్యనిర్వహణాధికారి ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ పరిరక్షణ కోసం తాను ఎప్పుడూ కూడా రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులకు ఆలయ నిర్వాహకులకు సంపూర్ణ సహాయ సాహకారం అందిస్తున్నానన్నారు. ఆలయాల వద్ద జరిగే ఉత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులతో మాట్లాడి ఆలయాల వద్ద ఏర్పాట్ల కోసం తన వంతు కృషి చేస్తున్నానన్నారు.

పారిశుద్ధ్యమే ఆరోగ్యానికి మూలం



పీరంచెరువులో చేపట్టిన పారిశుద్ధ్యంలో పాల్గొన్న కార్పొరేటర్లు

బండ్లగూడ: మన ఇంటితో పాటు పరిసరాలు పరిశభ్రంగా ఉన్నప్పుడే మనమంతా ఆరోగ్యంగా ఉంటామని పారిశుద్ధ్యమే మన ఆరోగ్యాలకు మూలమని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ 13వ, 14,16,21వ వార్డుల కార్పొరేటర్లు మాలతి నాగరాజ్, ఆసియాబేగం, షాపురం పుష్పారెడ్డి, అనిత వేంకటేష్‌లు అన్నారు. బుధవారం ఆయా వార్డుల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్రత్యేక పారిశుద్ధ్య పనులను చేపట్టారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని ప్రజలకు సూచించారు. శానిటేషన్ సిబ్బంది, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

హైపర్‌టెన్షన్‌పై అవగాహన, ర్యాలీ

రాయదుర్గం: కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎస్‌ఐ), గ్లెన్‌మార్క్ ఫార్మా ఆధ్వర్యంలో బుధవారం హైపర్‌టెన్షన్‌పై అవగాహన,వాకథాన్ నిర్వహించారు. ప్రపంచ హైపర్ టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో ఈ కార్యక్రమాన్ని ఉదయం 7 గంటలకు నిర్వహించగా వైద్యనిపుణులు, 150 మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైపర్ టెన్షన్‌తో పోరాడడానికి, నివారణ చర్యగా శారీరక శ్రమను ప్రోత్సహించే లక్ష్యంతో 2.5 కిలోమీటర్ల వాకథాన్ కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ వీఎస్ రామచంద్ర మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా దాదాపు ప్రతి ముగ్గురిలో ఒకరిని ఇది ప్రభావితం చేస్తుందన్నారు.దాదాపు 50 శాతం మందికి వారి పరిస్థితి గురించి తెలియదనే భయంకరమైన నిజాన్ని గణాంకాలు వెల్లడిస్తున్నామన్నారు. 18 ఏళ్ల వయస్సు నుంచే గుర్తింపు, పర్యవేక్షణ అవసరమని ఆయన సూచించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల అప్పగింత

విజయనగర్‌కాలనీ: హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు బుధవారం 50 సెల్‌ఫోన్లు అప్పగించారు. ఆసిఫ్‌నగర్ పోలీస్ డివిజన్ ఏసీపీ ఆర్‌జీ.శివమారుతి ఆధ్వర్యంలో హుమాయూన్‌నగర్ డిటెక్టివ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అహ్మద్ పాషా ఆధ్వర్యంలో 50 సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. రికవరీ చేసిన సెల్‌ఫోన్ల విలువ రూ.7.5 లక్షలు ఉంటుందని తెలిపారు. సెల్‌ఫోన్ల రికవరీలో చాకచక్యంగా వ్యవహరించిన అడిషనల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్‌రావు, ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, సిబ్బంది నాగేందర్, సాయి కుమార్, రమేష్‌ను అభినందించారు.

సన్మానం

గోల్కొండ: శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు కృషి చేస్తానని లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ మాధవిలత అన్నారు. లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్‌గా కొత్తగా నియమితులై పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బుధవారం కార్వాన్ బీఆర్‌ఎస్ హడ్‌హక్ కమిటీ సభ్యుడు శేఖర్‌రెడ్డి ఆమెను కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్ప గుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... తెలంగాణ పోలీసుల పనితీరు దేశంలోనే నెం.1 అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు శేఖర్‌యాదవ్ తదితరులున్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


కట్టడాలను కూల్చివేయిస్తున్న సిబ్బంది

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడాలను రాజేంద్రనగర్ తహసీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కూల్చివేశారు. బుధవారం మైలార్‌దేవ్‌పల్లి సర్వే నంబర్ 115తో పాటు సర్వే నంబర్ 52లో ప్రభుత్వ స్థలం ఉంది. కాగా సదరు స్థలంలో కొందరు ప్రహరీ నిర్మాణంతో పాటు బేస్‌మెంట్లను నిర్మించారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో తహసీల్దార్ సిబ్బందితో విచారణ చేయించారు. అనంతరం ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు ఉన్నాయని గుర్తించి బుధవారం ఉదయం కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఇప్పటికే జియో ట్యాగ్ ద్వారా గుర్తించామన్నారు.

యూనివర్సిటీ కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలి

విజయనగర్‌కాలనీ: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలలో కాంట్రాక్ట్ లెక్చరర్స్‌గా విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని జేఏసీ నాయకులు బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలిని ముట్టడించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ ఎ.పరశురామ్, కన్వీనర్ డాక్టర్ డి.ధర్మతేజ మాట్లాడుతూ.. తొమ్మిది ఏళ్ల నుంచి సీఎం కేసీఆర్ హామీ మేరకు తాము తప్పకుండా రెగ్యులరైజ్ అవుతామని వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి చొరవ తీసుకుని ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి తమను త్వరితగతిన రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 యూనివర్సిటీలలో కాంట్రాక్ట్ లెక్చరర్స్‌గా విధులు నిర్వహిస్తున్నవారందరూ పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ నాయకుల పాదయాత్ర

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పాపిరెడ్డి కాలనీ, వాంబే బస్తీ, సందయ్య నగర్‌లలో బీజేపీ రాష్ట్ర నాయకులు గజ్జల యోగానంద్ మంగళవారం రాత్రి పాదయాత్ర చేశారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో బీజేపీకే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ శేరిలింగంపల్లి అధ్యక్షులు రాజుశెట్టి, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి కాంచన కృష్ణ, నాయకులు సత్య కురుమ, శ్రీనివాస్, రఘు , బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు వైద్య పరీక్షలు


వైద్య శిబిరంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ హమీద్ పటేల్, యాత్రికులు

రాయదుర్గం: కొండాపూర్‌లోని జిల్లా ఆస్పత్రిలో హజ్ యాత్రికులకు రాష్ట్ర హజ్ కమిటీ, రంగారెడ్డి జిల్లా వైద్యవిభాగం సంయుక్తంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు, వ్యాక్సినేషన్ ప్రక్రియను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కాగా ఈ శిబిరంలో 50 మంది పరీక్షలను చేయించుకున్నారు. కార్యక్రమంలో కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్, హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ నిజాముద్దీన్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సృజన, డీఐఓ డాక్టర్ స్వర్ణ, జిల్లా ఆస్పత్రి డాక్టర్ మూర్తి, నాయకులు కృష్ణగౌడ్, రమేష్‌పటేల్, బలరామ్‌యాదవ్, చాంద్‌పాషా, తిరుపతిరెడ్డి, రజనీకాంత్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో క్రిస్టియన్లకు గౌరవం



గోల్కొండ: బీఆర్‌ఎస్ హయాంలోనే తెలంగాణలో క్రిస్టియన్‌లకు సముచిత గౌరవం ఇవ్వబడుతుందని టోలిచౌకి డివిజన్ నీరజ కాలనీలోని ఇమాన్యూయెల్ వర్షిప్ సెంటర్ పాస్టర్ ప్రభాకర్‌రావు అన్నారు. గవర్నర్ ఎమ్మెల్సీ కోటాలో గోనె సాల్మన్ రాజుకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని కోరుతూ బుధవారం వర్షిప్ సెంటర్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వర్షిప్ సెంటర్ సలహాదారులతో పాటు ఎక్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు ఏకగ్రీవంగా గోనె సాల్మన్ రాజుకు మద్దతుగా తీర్మానం చేశారు. యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉంటూ గోనె సాల్మన్ రాజ్ క్రిస్టియన్‌ల ఐక్యత, హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్నారన్నారు. అందువల్లే తాము ఏకగ్రీవంగా సాల్మన్‌రాజుకు మద్దతు ఇస్తూ సీఎం కేసీఆర్ గవర్నర్ కోటాలో గోనె సాల్మన్‌రాజును ఎమ్మెల్సీగా ఎంపిక చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వర్షిప్ సెంటర్ ప్రధాన కార్యదర్శి సునీల్, వర్షిప్ సెంటర్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.